సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 14 । మార్చి । 2025



పరీక్షలు ఖతం.. ఉరిమే ఉత్సాహం

ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారంతో పరీక్షలు ముగియడంతో ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. హాస్టళ్లు ఖాళీ చేసి కుటుంబ సభ్యులతో కలిసి ఇళ్లకు చేరారు. - 8లో..



గృహ నిర్మాణాలపై దృష్టి సారించండి

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ త్వరితగతిన ఇల్లు నిర్మించడంపై దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
35.8/25

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

శుక్రవారం	ఇఫ్తార్	
సాయంత్రం	గం 6 : 25	
శనివారం	సహరీ	
ఉదయం	గం 4 : 58	

న్యూస్‌రీల్

భూ అక్రమాల కేసుల విచారణ వేగవంతం చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్అన్సారియా

ఒంగోలు సిటీ: భూ అక్రమాలపై నమోదైన కేసుల విచారణను వేగవంతం చేయాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావుతో కలిసి భూ అక్రమాలపై నమోదైన కేసుల విచారణ పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ అక్రమాలపై నమోదైన కేసుల విచారణకు సంబంధించి పోలీసు అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కేసులకు సంబంధించి అవసరమైన డాక్యుమెంట్లను సంబంధిత రెవెన్యూ, మున్సిపల్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సత్వరమే విచారణాధికారులకు అందించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ ఏ బాలంజనేయులు, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, పలువురు సీఐలు, తహసీల్దార్ వాసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


17లోగా ఉన్నతాధికారులు సమాచారం అందించాలి

ఒంగోలు సిటీ: సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 21, 25 తేదీల్లో జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు శాఖల వారీగా ఉన్నతాధికారులు ఈ నెల 17వ తేదీలోగా సమాచారం అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అన్ని శాఖల జిల్లా అధికారులతో గురువారం కలెక్టర్ సమీక్షించారు. కాన్ఫరెన్స్‌లో పీపీటీ ద్వారా వివిధ అంశాలను, ముఖ్యంగా జిల్లాలోని పరిస్థితులను బట్టి టాప్-5 శాఖలకు సంబంధించిన వివరాలను, ప్రస్తుత సమస్యలు, మూడు నెలల్లోగా వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలను వెల్లడించాల్సి ఉందన్నారు. అందుకోసం సమగ్ర సమాచారాన్ని తనకు అందించాలని అధికారులకు సూచించారు. మూడో శనివారం సందర్భంగా ఈ నెల 15వ తేదీ నిర్వహించనున్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులను, ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడం కోసం ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. సమీక్ష సమావేశంలో సీపీఓ వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలానికి చెందిన ఒక బాలికకు తేలు కుట్టింది. ఆరోగ్యం క్షీణించడంతో వెంటనే ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. వైద్యులు వచ్చి చికిత్స చేసేసరికి పుణ్యకాలం కాస్తా గడిచిపోయింది. బాలిక మృతి చెందింది. వైద్యుల నిరక్ష్యం వలనే తమ కూతురి ప్రాణాలు పోయాయని ఆ బాలిక తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. వారి రోదన అరణ్య రోదనగానే మిగిలిపోయింది.

• • •

అర్ధవీడు మండలంలో ఒక బీటెక్ విద్యార్థి కాలికి గాయమై ఒంగోలు జీజీహెచ్‌కి తీసుకొచ్చారు. జూనియర్ వైద్యులు వచ్చి చూసి వెళ్లడం మినహా సీనియర్ వైద్యుడు తిరిగి చూడలేదు. దాంతో అతడు జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేశాడు. జిల్లా కేంద్రమైన ఒంగోలులోని సర్వజన ఆస్పత్రికి జిల్లాలోని అనేక గ్రామాల నుంచి ప్రతిరోజూ వందలాది మంది వస్తుంటారు. సకాలంలో వైద్యసేవలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రమైన నిర్లక్ష్యం, విపరీతమైన ఆలస్యం వెరసి చికిత్స కోసం వచ్చిన రోగుల ప్రాణాలు ఊరికే గాలిలో కలిసిపోతున్నాయి.



‘ఓపి’క నశిస్తూ..
పీజీలే దిక్కనిపిస్తూ!

● ఒంగోలు జీజీహెచ్‌లో అడుగడుగునా నిర్లక్ష్యం ● సకాలంలో అందని అత్యవసర వైద్యం
● వైద్యులు, సిబ్బంది తీరుతో గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు ● జీజీహెచ్ చుట్టూ దళారుల తిష్ట
● నత్తనడకన సీటీ స్కానింగ్ రిపోర్టులు ● సొంత ప్రాక్టీసుపైనే మక్కువ.. పీజీలతోనే వైద్యం

ఒంగోలు టౌన్:

జిల్లాలోని పెద్దాసుపత్రి (జీజీహెచ్)కి ఒంగోలు సమీపంలోని వివిధ గ్రామాల నుంచే కాకుండా పొరుగు జిల్లాలైన నెల్లూరు, పల్నాడు జిల్లాల నుంచి రోగులు వచ్చి వైద్యం చేయించుకుంటుంటారు. రోజుకు 800 నుంచి 1000 వరకు ఓపీలు నమోదవుతాయి. సీజనల్ వ్యాధులు విజృంభించే జూన్, జూలై, ఆగస్టు, డిసెంబర్, జనవరి నెలల్లో 1000 నుంచి 1200 వరకు రోగులు వస్తుంటారు. చిన్నాచితకా వ్యాధులతో పాటుగా రక్తపోటు, షుగర్, పక్షవాతం, గుండెజబ్బులు, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడే నిరుపేదలు, రోజూవారీ కూలీలు ఇక్కడకు చికిత్స కోసం వస్తుంటారు. ఓపీ కౌంటర్ వద్ద నుంచే వీరికి కష్టాలు మొదలవుతాయి. ఆన్‌లైన్లో ఓపీ రాయించాల్సి ఉంటుంది. ఒక్కోసారి సర్వర్ డౌన్ అవుతుంది. గంటల తరబడి సర్వర్ పనిచేయకపోవడంతో రోగులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇక్కడే సగం సమయం అయిపోతోందని రోగులు వాపోతున్నారు. అత్యవసర వైద్య సేవల విభాగంలో రోజూ కనీసం 150 మంది వరకు అడ్మిట్ అవుతుంటారు. ఆస్పత్రిలో 800 పడకలు ఉండగా, ఎప్పుడు చూసినా సగం పడకలు ఖాళీగా కనిపిస్తుంటాయి. అత్యవసర వార్డుల్లో తప్ప వైద్యులెవరూ ఇక్కడ కనిపించరు.

సొంత క్లినిక్‌లు.. పీజీలతో విధులు...

వైద్యశాలలోని అనేక విభాగాలలో స్పెషలిస్ట్ వైద్యులు కనిపించరు. నగరంలోని సొంత వైద్యశాలల్లో ప్రాక్టీసుకే ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారన్న విమర్శలున్నాయి. దాంతో వారు విధులకు రాకుండా పీజీలతోనే కథ నడిపిస్తుంటారన్న ఆరోపణలున్నాయి. ఎంతో ఆశతో చికిత్స కోసం వచ్చిన రోగులకు అసలు డాక్టర్ దర్శనం కనిపించదు. జూనియర్ డాక్టర్లే పలకరిస్తుంటారు. రోగుల వివరాలు సేకరించిన పీజీలు, జూనియర్ వైద్యులు ఆ వివరాలను మొబైల్ ఫోన్లో సీనియర్‌కు వివరిస్తారు. వారి సలహాలు, సూచనల ప్రకారం మందుల రాయడం, ఇంజక్షన్లు చేయడం లాంటివి చేస్తుంటారు. అంటే జీజీహెచ్‌లో స్పెషలిస్టు వైద్యానికి బదులు మొబైల్ వైద్యం జరుగుతోందని చెప్పవచ్చు. స్పెషలిస్టు వైద్యులు మాత్రం నెలనెలా లక్షలాది రూపాయల జీతాలు తీసుకుంటూ దర్జాగా నగరంలో ప్రైవేటు వైద్యశాలలు నిర్వహించుకుంటున్నారు. కొంత మంది వైద్యులైతే ఇక్కడ వైద్యం సక్రమంగా అందదని, సాయంత్రం తమ ఆస్పత్రికి వచ్చి చూపించుకోవాలని రోగులకు సూచిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

జీజీహెచ్ చుట్టూ దళారులు...

జీజీహెచ్ చుట్టూ నగరంలోని వివిధ ప్రైవేటు వైద్యశాలలు, గుంటూరు, విజయవాడలోని కార్పొరేట్ ఆస్పత్రులకు చెందిన దళారులు తిష్టవేసి కూర్చుంటున్నారు. వైద్యశాలలో పనిచేసే కొందరు వైద్యులను, కిందిస్థాయి సిబ్బందిని ప్రలోభాలకు గురిచేస్తున్నారు. అర్ధరాత్రి, అపరాత్రి అంబులెన్స్‌లో రోగిని జీజీహెచ్‌కి తీసుకొచ్చిన వెంటనే వారి కుటుంబ సభ్యుల చుట్టూ మూగుతున్నారు. ఇక్కడ వైద్యం బాగుండదని, నగరంలో పలానా ఆస్పత్రిలో మంచి డాక్టర్ ఉన్నారని, అక్కడ వైద్యం బాగుంటుందని మాయమాటలు చెప్పి రోగులను ప్రైవేటు వైద్యశాలలకు తరలిస్తున్నారు. భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణలో తలకు తీవ్రమైన గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన యర్రగొండపాలేనికి చెందిన ఒక మహిళను ఒంగోలు జీజీహెచ్‌కి తీసుకొచ్చారు. ఇక్కడ జీజీహెచ్‌లోని దళారులు ఆమెను ఎదురుగా ఉన్న ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పేరుతో సదరు వైద్యశాలలో ఏకంగా రూ.9 లక్షలు వసూలు చేసి అదనంగా ఫీజు చెల్లించలేదన్న సాకుతో అర్ధరాత్రి ఆస్పత్రి నుంచి బయటకు తోసేశారు. గతేడాది జరిగిన ఈ ఘటన జిల్లాలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

రిఫర్ కేసులే ఎక్కువ...

స్పెషలిస్టు వైద్యులు కాసేపు ఓపిగ్గా కూర్చుని వైద్యం చేయడానికి ఇష్టపడకపోతుండటంతో రోజురోజుకూ జీజీహెచ్‌లో రిఫర్ చేసే కేసులు పెరిగిపోతున్నాయి. గతంలో ఒకటీఅరా కేసులను మాత్రమే గుంటూరుకు రిఫర్ చేసేవారు. ఇప్పుడు ప్రతిరోజూ గుంటూరు జీజీహెచ్‌కి కేసులను తరలించడం ఎక్కువైపోయింది. రిఫర్ కేసులను తగ్గించాలని 108 సిబ్బంది డిమాండ్ చేసేంత వరకూ వెళ్లిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జిల్లాలోని అర్ధవీడులో ఒక వ్యక్తికి నరాలకు సంబంధించిన సమస్య వస్తే అక్కడి వైద్యులు వెంటనే సమీపంలోని కంభం తరలిస్తున్నారు. అక్కడి వైద్యులు మార్కాపురం ఏరియా వైద్యశాలకు వెళ్లాలని పంపిస్తే.. అక్కడి నుంచి ఒంగోలు జీజీహెచ్‌కి తరలిస్తున్నారు. తీరా ఇక్కడకు వచ్చిన తర్వాతైనా వైద్యం చేస్తారా..? అంటే లేదు. ఇక్కడి నుంచి గుంటూరు తరలించి వైద్యులు చేతులు దులుపుకుంటున్నారని వైద్యశాఖలోని ఉద్యోగులే చెప్పుకుంటున్నారు.

సీటీ స్కానింగ్ రిపోర్టుల కోసం ప్రదక్షిణలు...

సాధారణంగా అత్యవసర కేసుల్లోనే ఎక్కువగా సీటీ స్కానింగ్ తీస్తారు. అయితే, జీజీహెచ్‌లో సీటీ స్కానింగ్ తీయించుకోవాలంటే వారం రోజులు పడుతుంది. మరో 15 రోజులకు కూడా రిపోర్టు చేతికి అందని కేసులు అనేకం ఉన్నాయి. దాంతో పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది. తలకు దెబ్బలు తగిలిన రోగులు, పక్షవాతం రోగుల విషయంలో మొదటి గంట అనేది చాలా విలువైనదని వైద్యులు చెబుతుంటారు. గోల్డెన్ అవర్‌లో చికిత్స అందిస్తే వారిని ప్రాణాల నుంచి కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెబుతారు. కానీ, జీజీహెచ్‌లో మాత్రం రేడియాలజీ సేవలు ఒక జీవిత కాలం ఆలస్యంగా అందుతాయి. రేడియాలజిస్ట్ ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి. టెక్నీషియన్ల చేతనే సీటీ స్కానింగులు, ఎంఆర్ఐ స్కానింగులు తీయిస్తుంటారు. రిపోర్టులు ఎప్పుడో వారం తర్వాత ఇస్తుంటారు. ఇంత నిర్లక్ష్యం జరుగుతున్నా జీజీహెచ్ అధికారులు ఎందుకు పట్టించుకోరని రోగులు, వారి బంధువులు నిలదీస్తున్నారు.

అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ కర్ర తరలింపు





నరికివేతకు గురైన జామాయిల్ తోట

● విచ్చలవిడిగా నరికి లక్షలు దండుకుంటున్న టీడీపీ నాయకులు

సీఎస్ పురం (పామూరు): సీఎస్ పురం మండలంలోని అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ తోటలపై టీడీపీ నాయకుల కన్ను పడింది. పగలూరాత్రీ తేడాలేకుండా కూలీలను ఏర్పాటు చేసి మరీ యథేచ్ఛగా జామాయిల్ కర్ర కొట్టించి పలు ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. ట్రాక్టర్లు, లారీల ద్వారా తరలించి అమ్ముకుంటూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. సీఎస్ పురం మండలంలోని కంభంపాడు గ్రామం నుంచి పెదరాజుపాలెం వెళ్లే మార్గంలో నలజనంపాడు రెవెన్యూ పరిధిలో అగ్రిగోల్డ్ భూములు ఉన్నారు. ప్రస్తుతం సీఐడీ ఆధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లోని జామాయిల్ కర్రను గతేడాది డిసెంబర్‌లో కొందరు అక్రమార్కులు కొట్టి తరలించారు. కానీ, స్థానిక అధికారులుగానీ, సీఐడీ అధికారులుగానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీన్ని



తరలించేందుకు నిల్వ ఉంచిన జామాయిల్ కర్ర

ఆసరాగా తీసుకుని ప్రస్తుతం 202/1, 204/2, 3, 205/2, 3 సర్వే నంబర్లలో జామాయిల్ కర్రను అక్రమంగా నరికి తరలిస్తున్నారు. ఈ భూమిని గతంలో లింగసముద్రం మండలానికి చెందిన వ్యక్తి కొనుగోలు చేసి అగ్రిగోల్డ్ వారికి అమ్మారని, ప్రస్తుతం ఆ భూమిలోనే జామాయిల్ కర్ర కొడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. అగ్రిగోల్డ్ వారికి అమ్మినప్పటికీ.. ఆ భూములు అమ్మిన వ్యక్తి పేరుతోనే ఆన్‌లైన్‌లో ఉన్నాయని, దానిని అడ్డం పెట్టుకుని ఆ వ్యక్తి జామాయిల్ కర్రను అక్రమంగా కొట్టి తరలిస్తున్నాడని అంటున్నారు. అయితే, దీనిపై రెవెన్యూ అధికారులు విచారణ చేపడితే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉండగా, ఎవరూ పట్టించుకోవడం లేదు. వీటిని బూచిగా చూపి పలు సర్వే నంబర్లలో కూడా జామాయిల్ కొట్టి తరలించేందుకు సిద్ధమవుతున్నారు. జామాయిల్ కర్రను ఫైర్ ఉడ్, ప్లయ్ ఉడ్, కాగితపు తయారీ, భవన నిర్మాణంలో పోటీ కర్రలకు ఉపయోగిస్తుండగా, ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. మేలు రకం కర్ర టన్ను రూ.7 వేలు పలుకుతోంది. దీంతో అక్రమార్కులు చెలరేగిపోతూ లక్షలు కాజేస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

అగ్రిగోల్డ్ భూముల్లో ఎవరైనా జామాయిల్ కర్ర కొట్టి తరలిస్తే ఉపేక్షించం. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వీఆర్‌ఓను ఘటన స్థలానికి పంపి వివరాలు సేకరిస్తున్నాం. జామాయిల్ కర్ర కొట్టే సమయంలో సమీపంలోని గ్రామస్తులు సైతం బాధ్యతగా వ్యవహరించి రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

– డి.మంజునాథరెడ్డి, తహసీల్దార్, సీఎస్ పురం

మంచాన పడ్డా.. నా కుమారులు పట్టించుకోవడం లేదు..!

● పోలీసులను ఆశ్రయించిన ఓ తండ్రి

గిద్దలూరు రూరల్: ఆరోగ్యం బాగోలేదు.. ఆదుకోవాలని ప్రాధేయపడుతున్నా నా కుమారులు పట్టించుకోవడం లేదంటూ ఓ తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. గిద్దలూరు మండలం కె.ఎస్.పల్లెకు చెందిన శివాపురం రామకృష్ణ.. భార్య విజయతో కలిసి దుస్తుల వ్యాపారం చేసుకుంటూ తన ఇద్దరు కుమారులైన లక్ష్మీనారాయణ, గణేష్‌లను చదివించాడు. పిల్లలపై ప్రేమతో లక్షలు ఖర్చు చేసి ఉన్నత విద్య అందించాడు. ఇందుకోసం సుమారు రూ.30 లక్షల మేరకు అప్పులు కూడా చేశాడు. చివరికి రూ.50 లక్షల విలువ చేసే ఇంటిని కూడా కుమారుల పేరుతో రిజిస్టర్ చేశాడు. ప్రస్తుతం కుమారులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. ఇదిలా ఉండగా, రామకృష్ణ రెండేళ్లుగా కిడ్నీ, లివర్ వ్యాధి బారినపడి మంచం పట్టాడు. దగ్గరుండి చూసుకోవాల్సిన ఇద్దరు కుమారులు మొహం చాటేయడంతో గత్యంతరం లేని పరిస్థితిలో తనకు న్యాయం చేయాలంటూ భార్యతో కలిసి గురువారం పోలీసులను ఆశ్రయించాడు. తన ఇద్దరు కుమారులూ పట్టించుకోకపోవడంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



పోలీసుస్టేషన్ వద్ద రామకృష్ణ దంపతులు

మెకాట్రానిక్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు వన్‌టౌన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జర్మన్ లాంగ్వేజ్‌లో శిక్షణ, ప్లేస్‌మెంట్‌కు మెకాట్రానిక్స్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కార్పొరేషన్ జిల్లా అధికారి రవికృష్ణ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. డిగ్రీ/డిప్లమో ఇన్ మెకాట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఎనర్జీ సిస్టం, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన 18 నుంచి 40 సంవత్సరాల వయసు మధ్య గల వారు అర్హులన్నారు. ఈ విభాగాలలో కనీసం 3 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. శిక్షణ ఆరు నెలల పాటు ఉంటుందన్నారు. ఏ1, ఏ2, బీ1 లెవల్ శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం వీసా ప్రాసెసింగ్ ఉంటుందన్నారు. అభ్యర్థులకు ఆఫ్‌లైన్‌లో విజయవాడ/విశాఖపట్నంలో శిక్షణ ఉంటుందన్నారు. బీ1 లెవల్ శిక్షణ ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో కూడా ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన వారికి జర్మనీలో నెలకు రూ.2,800 యూరోల నుంచి రూ.3,600 యూరోల వరకూ వేతనం లభిస్తుందన్నారు. వీసా, ఫ్లైట్ ఖర్చులను ఉద్యోగం కల్పించే కంపెనీనే భరిస్తుందన్నారు. కంపెనీ ద్వారా హెల్త్ ఇన్సూరెన్స్ కూడా కల్పించనున్నట్లు చెప్పారు. డాక్యుమెంట్ ఖర్చులకు సుమారు రూ.30,000 వరకూ అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు రెండు విడతలుగా రూ.40,000 రీఫండ్‌బుల్ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు జర్మనీ వెళ్లిన తర్వాత ఈ డిపాజిట్లను తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు. పాస్‌పోర్టు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు రెండు, 10వ తరగతి మార్కుల మెమో, డిగ్రీ/డిప్లమో ధ్రువీకరణ పత్రం, అనుభవ ధ్రువీకరణ పత్రం, లైటు, లేదా హెవీ వెహికల్ లైసెన్సులను అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు జతపరచాలన్నారు. శిక్షణకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి చివరి తేదీ ఈ నెల 25 అని తెలిపారు. ఇతర వివరాలకు 99888 53335, 87901 18349 నంబర్లను సంప్రదించాలని రవికృష్ణయాదవ్ సూచించారు.

పులకించిన పృధులాద్రి

● వైభవంగా లక్ష్మీనృసింహస్వామి తిరునాళ్లు
● భక్తిశ్రద్ధలతో స్వామివారికి గరుడోత్సవం ● పోటెత్తిన భక్తులు



లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్



ఊరేగింపులో స్వామివారు

మర్రిపూడి: జిల్లాలో ప్రసిద్ధిచెందిన పృధులగిరి లక్ష్మీనృసింహస్వామి తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారికి గరుడసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులతో పృధులాద్రి కిటకిటలాడింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆగమజ్ఞులు నారాయణం ఆదిశేషాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం ఆదిశేషాచార్యులు, వెంకటసాయి స్వామివారిని ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించారు. గరుడసేవ సందర్భంగా స్వామివారిని పల్లకిపై ఉంచి బోయిలు మెట్లమార్గాన తీసుకెళ్లి అన్ని సత్రాల సమీపంలోని భక్తులందరికీ దర్శనభాగ్యం కల్పిస్తూ ఊరేగించారు. గరుడోత్సవానికి అలవల వెంకయ్య, సుందరరావు, వలేటి నర్సింహారావు ఉభయదాతలుగా వ్యవహరించారు. స్థానికులతో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి స్వామివారికి నైవేద్యంగా సమర్పించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఎండను సైతం లెక్కచేయకుండా క్యూలో వేచి ఉండి స్వామివారి మూలవిరాట్‌ను భక్తులు దర్శించుకున్నారు.

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు...

భక్తుల కోసం దేవదాయశాఖ ఈఓ సర్రా నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ సామాజికవర్గాలకు చెందిన సత్రాలలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిగ, పులిహోర, పెరుగన్నం పంపిణీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేయించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి తలనీలాలు సమర్పించి కోనేటి స్నానాలు ఆచరించారు. సంతానలేమితో బాధపడుతున్న వారు స్వామివారి సన్నిధిలో ఊయల కట్టడం ఆనవాయితీ కావడంతో పలువురు అనుసరించారు. మరికొందరు మెట్లదారిన నడిచి రాగా, సీతమ్మవారి పాదాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మెట్లను పసుపు, కుంకుమలతో పూజించి మొక్కులు తీర్చుకున్నారు. మర్రిపూడి వైద్యాధికారి వీరబాబు ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్, కొండపి సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో మర్రిపూడి, కొండపి, కనిగిరి మండలాల ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



పృధులాద్రిపై కిటకిటలాడుతున్న భక్తులు

క్లుప్తంగా

రచ్చ చేస్తే రంగుపడుద్ది

● హోలీ ప్రశాంతంగా చేసుకోవాలి
● ఎస్పీ దామోదర్ హెచ్చరిక

ఒంగోలు టౌన్: ఎవరినీ రెచ్చగొట్టకుండా సంతోషకర వాతావరణంలో హోలీ పండుగను చేసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన ఆయన శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పండుగ చేసుకోవాలన్నారు. ఇతరుల మనోభావాలను దెబ్బతినేలా వ్యవహరించవద్దని, మహిళల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో సమస్యలను సృష్టిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రార్థనా మందిరాల వద్ద రంగులు చల్లవద్దన్నారు. జిల్లాలోని ముఖ్యమైన పట్టణాలు, ప్రదేశాలు, కాలనీలు, రహదారులపై సీసీ కెమెరాలతో పాటుగా డ్రోన్ కెమెరాల నిఘా ఉంటుందని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలను నడపరాదని, వాహనాలను తనిఖీ చేయనున్నట్లు వివరించారు. ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తీసేసి పెద్ద శబ్దాలు చేయడం, చుట్టుపక్కల వారిని ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఎవరైనా గొడవలు పడినా, అసత్య ప్రచారాలు చేసినా, ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, మహిళలను వేధింపులకు గురిచేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తలిదండ్రులు పిల్లల పట్ల జాగ్రతగా ఉండాలని సూచించారు.

గోశాలకు మంటలు

● రూ.50 వేలు ఆస్తి నష్టం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మార్కాపురం: పట్టణ శివారులోని బీడుభూమిలో గురువారం చెలరేగిన మంటలు పక్కనే ఉన్న గోశాలకు వ్యాపించడంతో సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం సంభవించింది. ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ కథనం ప్రకారం.. తర్లుపాడు రోడ్డులోని బీడు భూముల్లో గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్ తాగి ముళ్లపొదల్లో పడేశాడు. వేసవి కాలం కావడంతో మంటలు చెలరేగి చుట్టుపక్కల ఉన్న పొదలకు వ్యాపించాయి. బీడు భూమి సమీపంలోనే ఉన్న గోశాలకు కూడా నిప్పు అంటుకుంది. ఆ సమయంలో గోవులు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. గోశాలలోని పశుగ్రాసం, ఇతర సామగ్రి కాలిపోయాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వెళ్లి మంటలు అదుపు చేశారు.

రుణాల రికవరీ వేగవంతం చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: రుణాల రికవరీని వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ సిబ్బందిని ఆదేశించారు. ఒంగోలు భాగ్యనగర్‌లోని టీటీడీ సెంటర్‌లో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, ఏరియా కో ఆర్డినేటర్లు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ రుణాల రికవరీ వేగంగా చేస్తేనే నూతన రుణాలు మంజూరుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి 15 రోజులకు ఒక సారి రుణాల రికవరీపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. స్త్రీనిధి, ఉన్నతి, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్, జీవనోపాధులు తదితర రుణాల రికవరీని వేగంగా చేయాలన్నారు. నూతన రుణాల మంజూరులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

700 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న లారీ

నాగులుప్పలపాడు: రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని గురువారం ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు పట్టుకున్నారు. చీరాల నుంచి ఒంగోలు వైపు రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ రాజ్యలక్ష్మి సిబ్బందితో దాడులు చేశారు. చదలవాడ నుంచి త్రోవగుంట వరకు లారీని వెంబడించి తనిఖీలు చేశారు. తనిఖీల్లో 700 బస్తాల రేషన్ బియ్యం గుర్తించి వాటిని సీజ్ చేసి ఎంఎల్ఎస్ గోడౌన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

మోటార్ సైకిల్‌లో పాము


కర్రసాయంతో పామును బయటకు తీస్తున్న దృశ్యం

దర్శి(ముండ్లమూరు): స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనంలోకి ఐదు అడుగుల పాము దూరింది. మోటారు సైకిల్‌లో శబ్దం రావడంతో పామును గుర్తించిన మోటారు సైకిల్ యజమాని స్థానికుల సాయంతో పామును బయటకు తీసేందుకు ప్రయత్నించారు. అయితే ఎంత సేపటికీ పాము మాత్రం బయటకు రాలేదు. కర్ర సాయంతో చివరకు అతి కష్టం మీద బయటకు తీయగా ఆ పాము జర్రిపోతని స్థానికులు తెలిపారు. దీంతో వాహన యజమాని ఊపిరి పీల్చుకున్నారు.

పరీక్షలు ఖతం.. ఉరిమే ఉత్సాహం


లేదు భారం.. ఇక ఇంటికి చేరుదాం: లగేజీతో వెళ్తున్న బాలికలు


జాలీ జాలీ ఎస్ పాప: పరీక్ష కేంద్రం వెలుపల సందడి చేస్తున్న ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థినులు


చిందేశాం : పరీక్ష బాగా రాసిన ఆనందంలో బాలికలు


కెవ్వు కేక : ఇంటికి వెళ్తున్న సంతోషంతో కేరింతలు




బైబై.. సీయూ: మిత్రులకు వీడ్కోలు చెబుతూ..

ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంగా ముగిశాయి. చివరిరోజు గురువారం విద్యార్థులు కెమిస్ట్రీ పరీక్ష రాశారు. అనంతరం సెంటర్ల వెలుపల కేరింతలు కొడుతూ సందడి చేశారు. మళ్లీ కలుద్దామంటూ మిత్రులకు వీడ్కోలు పలికారు. హాస్టల్ విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ఇళ్లకు పయనమయ్యారు. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ విద్యార్థులతో కిక్కిరిసింది. - సాక్షి, ఒంగోలు


చలో చలో: పిల్లలను ఇంటికి తీసుకెళ్లే హడావిడిలో తల్లిదండ్రులు

గృహ నిర్మాణాలపై దృష్టి సారించండి

కలెక్టర్ తమీమ్ అన్సారియా


వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కలిస్తూ త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునేలా దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలోని వీడియో కాన్ఫరెన్సు హాలు నుంచి మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓతో కలెక్టర్ గురువారం వీడియో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా జిల్లాలో 2029 నాటికి 'అందరికీ గృహ నిర్మాణం' అనే లక్ష్యాన్ని సాధించేందుకు, అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలు, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, పీవీటీజీ లబ్ధిదారులకు రూ.లక్ష అదనపు ఆర్థికసాయం అందజేస్తుందన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డ్ ఎమెనిటీస్ సెక్రటరీలు ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుని ఇంటిని తనిఖీ చేసి అవగాహన కల్పించి ఫొటో తీసుకోవాలన్నారు. గృహనిర్మాణ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ, వార్డు ఎమెనిటీస్ సహాయకులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లనిర్మాణం పూర్తి చేసుకునేలా సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మే నెలాఖరు నాటికి జిల్లాలో లక్ష్యం మేరకు 8,839 గృహలు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15న మూడో శనివారం చేపట్టే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో పటిష్టంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంస్థాగత నిర్మాణం, నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక శిక్షణలు ఇచ్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐజీఓటీ కర్మయోగి వెబ్ పోర్టల్ కు రాష్ట్ర ప్రభుత్వం అనుసంధానమైందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎఫ్ఎంఎస్ ఐడీ ఉన్న ప్రతి ఉద్యోగికి శిక్షణ ఇవ్వడమే దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ప్రతి ఉద్యోగి ఈ ప్రక్రియ ద్వారా విధిగా శిక్షణ పొందాల్సి ఉందన్నారు. హార్ట్ ఇన్ గవర్నెన్స్, కోడ్ ఆఫ్ కాండక్ట్ ఫర్ గవర్నమెంట్ ఎంప్లాయిస్, ఓరియంటేషన్ మాడ్యూల్ ఆన్ మిషన్ లైఫ్ అనే మూడు డిజిటల్ శిక్షణలనే ఉద్యోగి పనితీరును ప్రామాణికంగా చేసుకుంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వహించినంతకాలం ఈ మూడు శిక్షణల ఆధారంగానే సంస్థాగత నిర్మాణం జరుగుతుందన్నారు. ఒక్కో శిక్షణ కేవలం 18 నిమిషాలు మాత్రమే ఉంటుందని చెప్పారు. శిక్షణ తదుపరి ఆన్‌లైన్‌లో వచ్చే ప్రశ్నావళికి సరైన సమాధానాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఉద్యోగుల నైపుణ్యాలకు మెరుగులు పెట్టడానికే 856 శిక్షణ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఉద్యోగులంతా సద్వినియోగం చేసుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో శిక్షణలు ఇవ్వాల్సి ఉందన్నారు. సమీకృత ఆన్ లైన్ డిజిటల్ శిక్షణలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖాధికారి శ్రీనివాసరావు, డీపీఓ వెంకటనాయుడు, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, సీపీఓ వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, డీడీ సోషల్ వెల్ఫేర్ లక్ష్మానాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, ఏపీఓలు పాల్గొన్నారు.

కుంచేపల్లి ఎస్సీ కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు

● కాలనీలో బ్లీచింగ్, ఫాగింగ్, ఎబేట్ పిచికారీ
● వారం రోజులపాటు వైద్య శిబిరం నిర్వహణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

పొదిలిరూరల్: పొదిలి మండలంలోని కుంచేపల్లి ఎస్సీ కాలనీలో వారం రోజులపాటు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.సుగుణకుమార్ తెలిపారు. కాలనీ మొత్తం జ్వరాలతో ఇబ్బందులు పడుతుండటం, పారిశుద్ధ్య లోపంపై 'మంచం పట్టిన కుంచేపల్లి ఎస్సీ కాలనీ' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డాక్టర్ సుగుణకుమార్ మాట్లాడుతూ.. కాలనీ వాసులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర పీడుతులను గుర్తించారని చెప్పారు. కాలనీలో మురుగు నిల్వ ఉన్న ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించడంతోపాటు ఎబేట్ ద్రావణం పిచికారీ చేయించామని, దోమల నివారణకు ఫాగింగ్ చేయించామని వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


మురుగు నిల్వపై బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికుడు

ప్రియురాలితో పెళ్లి కోసం..

కత్తితో చేయి కోసుకుని యువకుడు ఆత్మహత్య


రవితేజ మృతదేహం

కనిగిరి రూరల్: ప్రియురాలితో పెళ్లి కోసం కత్తితో చేయి కోసుకుని యువకుడు ప్రాణం తీసుకున్నాడు. ఈ సంఘటన గురువారం రాత్రి కనిగిరిలో జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం..పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన రవితేజకు కనిగిరికి ఇందిరాకాలనీకి చెందిన పుట్టా లక్ష్మీదేవితో పరిచయం ఏర్పడింది. లక్ష్మీ భర్త ఐదేళ్ల క్రితం చనిపోయాడు. కొద్ది రోజులుగా లక్ష్మీని పెళ్లి చేసుకుంటానని రవితేజ గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఇదే విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన రవితేజ మద్యం సేవించి ప్రభుత్వాసుపత్రి సమీపంలో కత్తితో చేయి కోసుకున్నాడు. అధిక రక్తస్రావంతో రవితేజ మరణించినట్లు పోలీసులు తెలిపారు. వీఆర్ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శ్రీరాం పేర్కొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన 'చుండూరు'



ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు తాడేపల్లి కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితిని జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

కొండపి: కట్టెల ట్రాక్టర్, బైక్ ఢీకొని ఒకరు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని కొండపి నుంచి పొదిలి వెళ్లే రోడ్డులో గురువారం జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు..కొండపిలోని బీసీ కాలనీలో నివాసముంటున్న షేక్ మస్తాన్‌వలి కొండపి నుంచి బీసీ కాలనీ వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కట్టెల ట్రాక్టర్ ఢీకొని తలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించి కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

పోగొట్టుకున్న బంగారం బాధితులకు అప్పగింత

● సీసీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించిన పోలీసులు
● 4 సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరిస్తామన్న బాధితులు


బంగారం, నగదును బాధితుడికి అప్పగిస్తున్న పోలీసులు

మార్కాపురం టౌన్: మార్కాపురం మండలంలోని రామచంద్రకోటకు చెందిన వెన్నా కాశిరెడ్డి దంపతులు తమ నగదు, బంగారంను పోగొట్టుకోగా.. పోలీసులు గుర్తించి గురువారం అప్పగించారు. టౌన్ ఎస్సై సైదుబాబు కథనం ప్రకారం.. కాశిరెడ్డి దంపతులు పట్టణంలోని ఎస్వీకేపీ కళాశాల సమీపంలోని తన అక్క ఇంటికి బుధవారం వచ్చారు. అదే రోజు సాయంత్రం తూర్పువీధి మీదుగా స్వగ్రామానికి వెళ్లే సమయంలో బ్యాగును దారిలో పోగొట్టుకున్నారు. బ్యాగ్‌లో 4 తులాల బంగారు నల్లపూసల దండ, బంగారు చైను, 1,61,500 నగదు ఉండటంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు తూర్పువీధిలోని వాగ్దేవి కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. తూర్పువీధికి చెందిన ఓ మహిళ వద్ద బ్యాగ్ ఉన్నట్లు తేలడంతో వెంటనే స్వాధీనం చేసుకున్నారు. పోగొట్టుకున్న నగదును సీసీ కెమెరాల ద్వారా ఒక్క రోజులోనే గుర్తించి అప్పగించిన ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావును సీఐ సుబ్బారావు అభినందించారు. బాధితుడు కాశిరెడ్డి పట్టణంలో 4 సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని సీఐ తెలిపారు.

నమో వేంకటేశాయా..

● వెలుగొండలో వేడుకగా ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు
● నేడు స్వామి వారి కళ్యాణోత్సవానికి ఏర్పాట్లు


ప్రత్యేక అలంకరణలో శ్రీవారి మూలవిరాట్

కొనకనమిట్ల: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెలుగొండ శ్రీవారి ఆలయంలో గోవింద నామం ప్రతిధ్వనించింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలను గురువారం వేద పండితులు అంకురార్పణ చేశారు. శ్రీలక్ష్మీ అలివేలుమంగ సమేత వెలుగొండ వెంకటేశ్వరస్వామి మూలవిరాట్, ఉత్సవమూర్తులను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు ప్రసాదాచార్యులు, వెంకటరమణాచార్యులు, భార్గవ రామాచార్యులు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. కూనపులి రమణశర్మ ఆధ్వర్యంలో శ్రీవారి మూలవిరాట్‌ను చూడముచ్చటగా అలంకరించారు. పండితుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అంకురార్పణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. శుక్రవారం పగలు ధ్వజారోహణం, రాత్రికి శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ బ్రహ్మోత్సవాల ముగింపు వరకు నిత్యం శ్రీవారికి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో రాష్ట్ర స్థాయి పశు ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీవారి ఆలయం, పీఠమీద లక్ష్మమ్మ ఆలయాన్ని రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. కొనకనమిట్ల మండలంలోని మునగపాడులో చౌడమ్మ తల్లి తిరునాళ్ల వేడుకగా నిర్వహించారు. 7 విద్యుత్ ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


మునగపాడులో వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభల్లో ఒకటి..

ఇతరుల పేరుపై భూమి ఆన్‌లైన్

● తహసీల్దార్ కార్యాలయం వద్ద తండ్రీకొడుకుల నిరసన
● ఈడ్చిపడేసిన పోలీసులు


అంజిరెడ్డిని ఈడ్చుకెళ్తున్న పోలీసులు

పొదిలి: తరతరాలుగా తాము సాగు చేసుకుంటున్న భూమిని ఇతరుల పేరుపై ఆన్‌లైన్ చేశారని నందిపాలెం గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు వెంకట సుబ్బయ్య, అంజిరెడ్డి గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కరించే వరకు కదిలేది లేదని కార్యాలయంలోనే భైఠాయించి నిరసన తెలిపారు. ఆరేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పెద్ద పెట్టున కేకలు వేశారు. తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి ఆదేశాలతో కార్యాలయానికి చేరుకున్న పోలీసులు తండ్రీ కొడుకులను బయటకు తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో జరిగిన పెనుగులాటలో సుబ్బయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. అంజిరెడ్డిని పోలీసులు ఈడ్చుకుంటూ వెళ్లి తమ జీపులో పడేశారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. ఆరేళ్ల క్రితం నాటి సమస్యపై ఇప్పుడు మరోమారు ఫిర్యాదు చేశారు. భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు ఏవైనా ఉంటే ఇవ్వాలని కోరగా వినిపించుకోలేదు. మద్యం సేవించిన అంజిరెడ్డి దుర్భాషలాడటంతో పోలీసులకు సమాచారం ఇచ్చా. వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లు అందచేస్తే పరిశీలించి న్యాయం చేస్తా' అని చెప్పారు.